సాక్షి కర్నూలు

శుక్రవారం : 17 : మే : 2024



వైభవంగా పల్లకోత్సవం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రుల పల్లకోత్సవం గురువారం వైభవంగా జరిగింది. బృందావన ప్రతిమకు ఊంజల సేవ నిర్వహించి, శ్రీమఠం ప్రాంగణంలో పల్లకోత్సవం చేపట్టారు.



దత్తాత్రేయునికి ప్రత్యేక అర్చన

శ్రీశైలం: లోక కల్యాణార్థం దత్తాత్రేయ స్వామికి గురువారం ప్రత్యేక అర్చన నిర్వహించారు. క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం జరిపారు.



అన్నప్రసాద పథకానికి విరాళం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థాన శాశ్వత అన్నప్రసాద పథకానికి గురురవారం హైదరాబాద్‌కు చెందిన వి.కె.అశ్విన్ రూ.1.01.116 విరాళాన్ని పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేశారు.

న్యూస్‌రీల్

సత్తాచాటిన బనవాసి విద్యార్థులు

- సీబీఎస్‌ఈ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత



విద్యార్థికి స్వీట్ తినిపిస్తున్న ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 10వ, 12వ తరగతి సీబీఎస్‌ఈ ఫలితాల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ.పద్మావతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ విడుదల చేసిన ఫలితాల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు చెప్పారు. 10వ తరగతిలో ఎస్. చరణ్ (583/600) , బి. వీరేష్ (550/600), కె. మారుతి (543/ 600) ప్రతిభ కనబరిచారన్నారు. 12వ తరగతిలో యు.తరుణ్ (455/500), సాయి సుజిత్ (442/500), ఎ. ధర్మేంద్ర (427/500) సత్తా చాటినట్లు తెలిపా రు. ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఓట్ల లెక్కింపునకు సచివాలయ ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న ఓట్ల లెక్కింపునకు గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను కూడా వినియోగించుకోనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు కర్నూలు అర్బన్, రూరల్, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లోని సచివాలయ ఉద్యోగుల వివరాలను పంపుతున్నామన్నారు. జూన్ 4న కర్నూలు పార్లమెంట్, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపు కర్నూలులోనే కొనసాగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే ఓట్ల లెక్కింపులో పాల్గొనే అధికారులు, ఉద్యోగులకు సహకారాన్ని అందించేందుకు ఈ మండలాలకు చెందిన సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించనున్నట్లు చెప్పారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం

కర్నూలు(అర్బన్): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అపరిశుభ్రత కారణంగా అంటు రోగాలు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టీ నాగరాజునాయుడు తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లోని మెయిన్ రోడ్లు, సందుల్లో, చెత్త కుండీల వద్ద ఎక్కడా కూడా చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఎప్పటికప్పుడు డ్రైన్లను శుభ్రం చేయాలన్నారు. మంచి నీటి ట్యాంకులను నిర్ణీత సమయానికి శుభ్రం చేయాలన్నారు. పల్లెల్లో అంటు రోగాలు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామన్నారు. 2003-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వసూలు చేయాల్సిన పన్నులపై ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ ఆదేశించారు. లక్ష్యం రూ.36.55 కోట్లు కాగా, ఈ ఏడాది మార్చి నాటికి రూ.19 కోట్లు మాత్రమే వసూలయ్యాయన్నారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో క్షేత్ర స్థాయిలోని సిబ్బంది పన్నుల వసూళ్లపై దృష్టి సారించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.



పెద్దకడుబూరు మండలంలో మేజర్ చానెల్ పనులు చేస్తున్న దృశ్యం



కల్లూరు మండలం తడకనపల్లిలో పర్కులేషన్ ట్యాంక్ పనులు

మొక్కవోని సంకల్పం

- మొక్కల పెంపకంపై జిల్లా నీటియాజమాన్య సంస్థ దృష్టి
- 200 కిలోమీటర్లలో అవెన్యూ, కెనాల్ ప్లాంటేషన్
- 10,350 ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనే లక్ష్యం
- ఉద్యమ తరహాలో జలసంరక్షణ పనులు
- అమృత్ సరోవర్‌లు, ఫాంపాండ్‌లకు ప్రాధాన్యత

ఈ ఏడాది వేసవిలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో భగ్గుమన్న మండు టెండలు ప్రజలను భయపెట్టాయి. పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తే ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉండటంతో మొక్కలు నాటే కార్యక్రమంపై జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం కెనాల్, అవెన్యూ ప్లాంటేషన్‌ను విస్తృతంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. అంతేకాకుండా వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగేలా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇస్తోంది.

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ఏడాది వరకు వేసవిలో గరిష్టంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది అవి 47 డిగ్రీలు దాటాయి. ఇందుకు ప్రధాన కారణం పచ్చదనం లేకపోవడమేనని జిల్లా నీటియాజమాన్య సంస్థ అధికారులు గుర్తించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సంకల్పించారు. ఇందులో భాగంగా 200 కిలోమీటర్ల పొడవునా మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. కేసీ కెనాల్, ఎల్‌ఎల్‌సీ, హెచ్‌ఎల్‌సీ, గాజుల దిన్నె ప్రాజెక్టు వంటి వాటి పరిధిలో కెనాల్ ప్లాంటేషన్ కింద కిలోమీటరుకు 400చొప్పున 100 కిలోమీటర్ల మేర మొక్కలు నాటనున్నారు. మొత్తం 4 లక్షల మొక్కలు నాటే అవకాశం ఉంది. అలాగే అవెన్యూ ప్లాంటేషన్ కింద మరో 100 కిలోమీటర్ల మేర మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. వీటిని సంరక్షించే బాధ్యత జిల్లా నీటియాజమాన్య సంస్థ తీసుకోనుంది. అంతేగాక ఇన్‌స్టిట్యూషనల్ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ కింద పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఆలూరు, ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ, ఎమ్మిగనూరు మండలం బనవాసిలో నర్సరీలు ఉండగా.. అవెన్యూ, కెనాల్ ప్లాంటేషన్‌కు అవసరమైన మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లా నీటియాజమాన్య సంస్థ ఏర్పాటు చేసిన నర్సరీల నుంచి రైతులకు అవసరమైన మొక్కలు ఉచితంగా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎమ్మిగనూరు మండలం బనవాసిలో పండ్ల మొక్కలు నాటిన దృశ్యం

పండ్లతోటల అభివృద్ధి..

జిల్లాలో ఈ ఏడాది 10,350 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉండి, జాబ్ కార్డు కలిగిన రైతులందరూ పండ్లతోటల అభివృద్ధికి అర్హులే. ప్రస్తుతం అర్హులైన రైతులను ఎంపిక ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. సాధారణంగా ఈ పాటికి జిల్లా కలెక్టర్ నుంచి పరిపాలనా అనుమతులు తీసుకోవడం, పిట్టింగ్ పనులు చేపట్టడం జరిగేది. ఈ సారి సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా పరిపాలనా అనుమతులు తీసుకునే ప్రక్రియ మొదలు కాలేదు. అయితే పండ్ల తోటల అభివృద్ధిపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించే కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. ఇప్పటికే 4,000 ఎకరాల్లో పండ్లతోటల అభివృద్ధికి అర్హులైన రైతులను గుర్తించారు. మామిడి, సపోట, జామ, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్స్, చీనీ, నిమ్మ ఇలా అన్ని రకాల పండ్లతోటలు 100 శాతం సబ్సిడీతో అభివృద్ధి చేసుకోవచ్చు. ఎకరాకు సగటున 70 మొక్కలు నాటుతారు. పండ్లతోటల అభివృద్ధి ద్వారా 7.25 లక్షల మొక్కలు నాటే అవకాశం ఏర్పడింది.

జలసంరక్షణ పనులకు ప్రాధాన్యం

ఉపాధి పనుల్లో భాగంగా జలసంరక్షణ పనులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఊరూరా చేపట్టిన పనుల్లో 95 శాతం భూగర్భ జలాల అభివృద్ధి, జల సంరక్షణ పనులే చేపడుతున్నారు. ఫీడర్ చానల్స్‌ల్లో పేరుకుపోయిన పూడిక తీయడం వల్ల వర్షపు నీరు చెరువుకు చేరుతుంది. ఉపాధి నిధులతో 50 అమృత్ సరోవర్‌లు, 960 మినీ అమృత్ సరోవర్‌లను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. చెరువులను అమృత్ సరోవర్‌లుగా, కుంటలు వంటి వాటిని మినీ అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేస్తారు. అమృత్ సరోవర్‌లతో పూడిక తీయడం, కట్టలు బలోపేతం చేయడం చెరువు కట్టలపై మొక్కలు నాటడం వంటి పనులు చేపడుతారు. అలాగే 9,600 ఫాంపాండ్స్ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. వీటితో పాటు పర్కులేషన్ ట్యాంకులు, మేజర్ కెనాల్స్, బౌండరీ ట్రెంచెస్ తవ్వకాల పనులు జరుగుతున్నాయి.

మొక్కలతో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి



2024-25 సంవత్సరంలో పచ్చదనం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. పండ్లతోటల అభివృద్ధి ద్వారా దాదాపు 7.25 లక్షల పండ్ల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అవెన్యూ, కెనాల్ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టాం. ఈ ఏడాది ఉపాధి నిధులతో జలసంరక్షణ పనులు కూడా పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అమృత్‌సరోవర్‌లు, మినీ అమృత్ సరోవర్‌లు, ఫాంపాండ్స్ వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. మొక్కలు నాటడం, జలసంరక్షణ పనులు చేపట్టడం వల్ల జిల్లాను అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవచ్చు.

– అమరనాథరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా

ఇసుక అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు



పల్‌దొడ్డి ఇసుక రీచ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక రీచ్‌లలో తవ్వకాలు చేయకూడదని, ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ హెచ్చరించారు. సి బెళగల్ మండలం పల్‌దొడ్డి గ్రామంలోని ఇసుక రీచ్‌ను గురువారం జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ విలేకరులతో మాట్లాడుతూ.. ఇసుక తరలింపుపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలిచ్చిందన్నారు. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక రీచ్‌లలో తవ్వకాలు జరపకూడదని ఆదేశాలు జారీ చేసిందన్నారు. 15 రోజుల కిందటే ఇసుక రీచ్‌లలో తవ్వకాల పనులు ఆపేశారని చెప్పారు. అలాగే సి బెళగల్ మండలం కె సింగవరం వద్ద బోటు ద్వారా ఇసుకను తీసే ప్రదేశాన్ని తనిఖీ చేశామన్నారు. అక్కడే ఉన్న బోటులను వెంటనే ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 61 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.టి.కె.నాయక్ , రిజిస్ట్రార్ డాక్టర్ నాగుల అంకన్న పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం సెషన్‌లో డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 9,803 మందికి 8,866, బీఈడీ మూడో సెమిస్టర్‌కు 3,306 మంది విద్యార్థులకుగాను 3,089 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 60 మందికి 55 మంది, బీఈడీ మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 1355 మందికి 12260 మంది విద్యార్థులు హాజరయ్యారని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ జి.కృష్ణకాంత్, పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్యతో కలసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పనిచేసే పోలీసు బలగాలు 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడ పనిచేసే సీసీ కెమెరాల లైవ్ ఫీడింగ్‌ను 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ నుంచి వీక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రతా చర్యల్లో వైఫల్యం చెందితే వేటు తప్పదని హెచ్చరించారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఎమ్మిగనూరు ఆర్వో చిరంజీవి, కూడా వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, డిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్‌కు 4,610 మంది హాజరు

కర్నూలు కల్చరల్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విద్యలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ గురువారం ప్రారంభమైంది. దూపాడు ఐయాన్ డిజిటల్ జోన్, నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని ఐయాన్ డిజిటల్ జోన్, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజ్, పెద్దటేకూర్ సమీపంలోని బృందావన్ ఇనిస్టిట్యూట్, కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఫర్ ఉమెన్, ఆదోనిలోని బీమా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, ఎమ్మిగనూరులోని సెయింట్‌జాన్స్ ఇంజనీంగ్ కాలేజ్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్‌లలో ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. మొదటి రోజు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షకు 4,931 మందికి 4610 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. రాయలసీమ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్‌ప్రేమ్‌కుమార్, రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.టి.కె.నాయక్ జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలల్లోని కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించారు.



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



పరీక్ష హాల్‌లోకి వెళ్లేందుకు క్యూకట్టిన విద్యార్థినులు

కాయ్.. రాజా.. కాయ్...!

బస్సుల్లో, ఆటోల్లో, సెలూన్లలో, హోటళ్లలో.. ఇలా ప్రతి చోటా పల్లె.. పట్టణం అన్న తేడా లేకుండా ఏ నలుగురు గుమికూడినా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపోటములపైనే చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో ఏ పార్టీ గెలవబోతోంది.. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి.. అభ్యర్థులకు వచ్చే మెజార్టీలు.. తదితర అంశాలపై తమకు తెలిసింది, అక్కడక్కడ విన్నది చెబుతున్నారు. పోలింగ్ జరిగిన తీరును బేరీజు వేసుకుంటూ పలువురు కాయ్ రాజా కాయ్ అంటున్నారు. స్థాయిని బట్టి రూ. వేల నుంచి రూ. కోట్లలో బెట్టింగ్ కడుతున్నారు.

- జిల్లాలో జోరుగా సాగుతున్న పందేలు
- పోలింగ్ ముగియడంతో గెలుపోటములపై బెట్టింగ్‌లు
- మరోసారి వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందంటున్న విశ్లేషకులు
- ఇరు పార్టీల మధ్య పందెం సెట్ చేసి కమీషన్ తీసుకుంటున్న మధ్యవర్తులు

సాక్షి, నంద్యాల/ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల్లో అత్యంత ప్రధానమైన పోలింగ్ ఘట్టం ముగిసింది. ఇక మిగిలింది ఓట్ల లెక్కింపు మాత్రమే. దీంతో గెలుపోటములు, మెజార్టీలపై ఉత్కంఠ నెలకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా పోలింగ్ శాతం పెరిగింది. ఓటర్లు పోలింగ్ ప్రారంభానికి ముందుగానే క్యూలైన్లలో బారులుతీరి నిలబడి ఓర్పుతో ఓటెయ్యడం.. అందులో మహిళలు, వృద్ధులు ఉండటం ఏ పార్టీకి అనుకూలంగా ఉంటాయనే దానిపై అంచనాలు వేస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన నేతలు గ్రామ, మండలాల వారీగా కూడికలు, తీసివేతల పనిలో నిమగ్నమయ్యారు. సామాజిక వర్గాలు, గ్రూపులు, వర్గాల వారీగా కూడా అంచనాలు వేసుకుంటూ ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నారు. ఫలితాలకు సమయం ఉండడంతో ప్రస్తుతం బెట్టింగ్ రాయుళ్ల హవా నడుస్తోంది.

స్థాయిని, మెజారిటీని బట్టి రేట్లు

రాజకీయాలపై ఆసక్తి ఉన్న కొందరు 'మీ నియోజకవర్గంలో ఎలా ఉంది. ఎవరు గెలిచే అవకాశం ఉంది.. ఎంత మేర మెజార్టీ రావచ్చు' అని ఇతర ప్రాంతాల్లో ఉంటున్న బంధువులను, పరిచయస్తులకు ఫోన్లు చేసి మరీ తెలుసుకుంటున్నారు. కొందరు నాయకులు చేసిన అభివృద్ధి, అభ్యర్థుల వ్యక్తిత్వం, వ్యతిరేకత, పంపిణీ చేసిన నగదు తదితర అంశాలపై అంచనాలు వేసుకుంటున్నారు. జిల్లాలో అభ్యర్థుల మెజారిటీలతో పాటు ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ కూటమికి ఎన్ని సీట్లు వస్తాయన్న దానిపైనే ప్రధానంగా పందేలు నడుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారాన్ని హస్తగతం చేసుకుంటుందని జోరుగా పందేలు కాస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నా పందేలకు మాత్రం దూకుడుగా ముందుకు రావడం లేదని బెట్టింగ్ రాయుళ్లు చెబుతున్నారు. అసెంబ్లీకి ఎవరు గెలుస్తారు.. గెలిస్తే ఎంత మెజారిటీ వస్తుంది.. ఎంపీ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుందన్న అంశాలే బెట్టింగ్ రాయుళ్లకు ప్రధానాంశాలుగా మారాయి. మెజారిటీ ఎక్కువగా వస్తుందని పందెం వేస్తే ఒకటికి మూడు, నాలుగు ఇచ్చేందుకు కూడా సిద్ధపడుతున్నారు.



రాష్ట్రంలో ఇతర నియోజకవర్గాలపైనా...

జిల్లాలో పందెం రాయుళ్ల హాట్ ఫేవరేట్‌గా పిఠాపురం నిలుస్తోంది. అక్కడ పోటీలో ఉన్న పవన్ కల్యాణ్, వంగా గీతలో ఎవరు గెలుస్తారు.. గెలిస్తే ఎంత మెజారిటీ వస్తుందన్న దానిపై పందెం కాస్తున్నారు. గత ఎన్నికల్లో భీమవరం, గాజువాకలో పోటీ చేసి పవన్‌కల్యాణ్ ఓడిపోవడంతో ఈ సారి గెలిచి అసెంబ్లీలో అడుగుపెడతారా? లేక అలవాటైన రీతిలో ఓడిపోతారా? అని ఆరా తీస్తున్నారు. మంగళగిరి, హిందూపురం, కుప్పం స్థానాలపైనా పందేలు నడుస్తున్నాయి. కుప్పంలో చంద్రబాబుకు మెజార్టీ తగ్గుతుందని పందెం కాయడానికి ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నట్లు పందెం రాయుళ్లు చెబుతున్నారు.

టీడీపీ వైపు ముందుకురాని పందెంరాయుళ్లు

నంద్యాల జిల్లాలో వైఎస్సార్ సీపీ గెలిచే స్థానాలపై పందెం కాసేందుకు టీడీపీ అభిమానులు ముందుకు రావడం లేదు. 2014లో ఒక్క బనగానపల్లె మినహా అన్ని స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ గెలిచింది. 2019లో ఉమ్మడి జిల్లా క్లీన్ స్వీప్ చేసింది. ఈ ఐదేళ్లలో సంక్షేమం ఇంటి ముంగిటకే రావడంతో ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరుపై పూర్తి సంతృప్తితో ఉన్నారు. తాజాగా జరిగిన పోలింగ్‌లోనూ ఇదే అంశం ప్రస్ఫుటమైనట్లు భావిస్తున్నారు. దీంతో మరోసారి వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని అంచనాలు ఉండడంతో పందెం కాయడానికి టీడీపీ వారు ముందుకు రావడం లేదని పంటర్స్ చెబుతున్నారు.

మెజారిటీలపై..

2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు భారీ మెజారిటీలతో గెలిచారు. ఈ ఎన్నికల్లోనూ గెలుపు గ్యారంటీ అని, గత ఎన్నికలతో పోలిస్తే కాస్త మెజారిటీ అటు ఇటుగా ఉంటుందని.. మెజారిటీలపై పందెం కాయడానికి సిద్ధమని టీడీపీ నుంచి ఆఫర్స్ వస్తున్నట్లు పంటర్స్ చెబుతుండడం గమనార్హం. అలాగే డోన్ నుంచి ఈ సారి మంత్రి బుగ్గన హ్యాట్రిక్ సాధిస్తారని ఎక్కువ మంది పందెం కాయడానికి ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఆళ్లగడ్డ, బనగానపల్లెలో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల మెజారిటీలపై జోరుగా పందేలు కాస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఇద్దరి మధ్య పందెం సెట్ చేసి పెద్ద మత్తంలో పంటర్స్ కమీషన్ తీసుకుంటున్నారు.

టీడీపీ నేతల మేకపోతు గాంభీర్యం

ఓటమి తప్పదని తెలిసినప్పటికీ టీడీపీ నేతలు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. మొన్నటి దాక భారీ మెజార్టీతో గెలుస్తున్నామని ప్రచారం నిర్వహించుకున్నారు. నిన్నటి వరకు స్వల్ప మెజార్టీతో అయినా గెలుపు మాదే అంటున్నారు. తాజాగా వైఎస్సార్ సీపీకి గతంలో వచ్చిన అంత మెజార్టీ రాదు తక్కువ మెజార్టీతో బయటపడొచ్చు అని చర్చించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ధైర్యం

పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలకు మేలు చేకూర్చే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొన సాగించారు. ముఖ్యంగా యువత కోసం ఎన్నో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. మహిళలకు పలు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేద వర్గాల ప్రజల కోసం ఇంత సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయలేదు. కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే వారికి మేలు చేకూర్చింది. పోలింగ్ తీరును పరిశీలిస్తే ..మహిళలు, వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. ఈ ఓటు బ్యాంకు అంతా వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉండటంతో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు నల్లేరుపై నడకేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

క్లుప్తంగా

తెలంగాణ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ తిమ్మయ్య

నందవరం: అక్రమంగా తెలంగాణ మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ..నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. నందవరం మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామానికి చెందిన కురవ రాజు తెలంగాణ రాష్ట్రం అయిజలో తెలంగాణ మద్యాన్ని కొనుగోలు చేసి నాగలదిన్నె బ్రిడ్జిపై తలిరలిస్తుడంగా పట్టుకున్నామని తెలిపారు. తెలంగాణ మద్యం 245 డెక్కన్ బ్లూ వీస్కీ 180 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. తనిఖీల్లో పోలీసులు సోమశేఖర్‌గౌడ్, మల్లికార్జున పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య



వంశీ (ఫైల్)

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామంలోని నీళ్ల ట్యాంకుపైనుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. సంద్రబోయిన వెంకటేశ్వర్లు, రాములమ్మ దంపతుల కుమారుడు వంశీ (22) చెడు వ్యసనాలతో తిరుగుతుండగా తల్లి మందలించింది. మనస్తాపం చెందిన వంశీ బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఊరి చివరలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు పైకి ఎక్కి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

భవితకు బాట.. ఐటీఐ

- కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువ
- పారిశ్రామిక శిక్షణా కేంద్రాల్లో ప్రవేశాలకు తొలి దశ నోటిఫికేషన్ విడుదల
- ఈ ఏడాది ప్రారంభం కానున్న డ్రోన్ టెక్నాలజీ స్వల్ప కాలిక కోర్సు
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు జూన్ 10న తుది గడువు



టెక్నికల్ కోర్సులు అభ్యసిస్తున్న ఐటీఐ విద్యార్థులు(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షలు పూర్తయి ఫలితాలు కూడా విడుదలయ్యాయి. పది అనంతర కోర్సులపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దృష్టి కేంద్రీకరించారు. ఇప్పటికే పాలిసెట్, రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షలు పూర్తయ్యాయి. పలువురు విద్యార్థులు ఏ కోర్సులో చేరాలా అని ఆలోచన చేస్తున్నారు. అధిక శాతం మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరగా, కొందరు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐ కోర్సులు చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసినవారు ఉన్నత విద్యను అభ్యసించేందుకు చక్కటి అవకాశంగా భావించవచ్చు. సాంకేతిక కోర్సుల్లో ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు పలువురు విద్యార్థులు ఐటీఐ (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్)కు అధిక ప్రాధాన్యమిస్తున్నారు.

నైపుణ్యముంటే ఉద్యోగం సులువే..

ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందొచ్చు. విద్యుత్, రైల్వే, రక్షణ తదితర ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. పూర్తి చేసిన ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ కోర్సు దోహదపడుతుంది.

రెండేళ్ల కాలపరిమితి కోర్సులు..

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఆర్ అండ్ ఏసీ టెక్నాలజీ, మెకానికల్ మోటార్ వెహికల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్టిట్యూట్ మెకానిక్, టర్నర్, మెషీనిస్ట్.

ఏడాది కాలపరిమితి కోర్సులు..

మెకానిక్ డీజిల్, సీఓపీఏ, వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ, పీపీవో.

ఏడాది, రెండేళ్ల వ్యవధితో రెగ్యులర్ కోర్సులు

ఐటీల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఇనుస్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ తదితర కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరగోరే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే తరగతుల ప్రవేశానికి షెడ్యూల్ విడుదల చేస్తారు. ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 10న తుది గడువుగా ఉపాధి, శిక్షణ శాఖ ప్రకటించింది.

డ్రోన్ టెక్నాలజీపై స్వల్ప కాలిక కోర్సు ప్రారంభం

ఈ ఏడాది నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా డ్రోన్ టెక్నాలజీపై ఆరు నెలల వ్యవధి కోర్సును ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు ఉన్న ఈ కోర్సును ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తున్నారు. వ్యవసాయం, సర్వే, షూటింగ్స్‌లో డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 ఐటీఐల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో భాగంగా నంద్యాల ప్రభుత్వ ఐటీఐలో ఈ కోర్సును ఈ ఏడాది ప్రారంభించే అవకాశముంది.



డోన్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల

ఉన్నత చదువులకు అవకాశం

ఐటీఐ కోర్సుల్లో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు అనంతరం బీటెక్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపర్చుకోవడానికి కూడా ఈ కోర్సు దోహదపడుతుంది. ఈ విధంగా ఏటా పలువురు విద్యార్థులు నేరుగా లేటరల్ ఎంట్రీని పొంది, ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత ఉద్యోగావకాశాలను పొందుతున్నారు.

అందుబాటులో 3,276 సీట్లు

జిల్లాలో ఐదు ప్రభుత్వ ఐటీఐలు, 16 ప్రైవేట్ యాజమాన్యంలో ఉండగా, వీటిలో ఏడాది, రెండేళ్ల కాలపరిమితితో 3,276 సీట్లు ఉన్నాయి. జిల్లాలో 16 ప్రైవేట్ యాజమాన్యంలో 2,300 సీట్లు ఉన్నాయి. నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 976 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు 3,276 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ఐటీఐలో చేరగోరే విద్యార్థులు జూన్ 10వ తేదీ 11.59 గంటలలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పరిశీలన సమయంలో సమీప ప్రభుత్వ ఐటీఐలకు విధిగా హాజరు కావాలి. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను విద్యార్థుల మొబైల్ నంబరుకు పంపిస్తాం. పదవ తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి.

– ప్రసాదరెడ్డి, జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, నంద్యాల

ప్రజల తీర్పు జగనన్న వైపే

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పు జగనన్న వైపే ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం సి.క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 4న జరిగే కౌంటింగ్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయ దుందుభీ మోగించడం ఖాయమన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే స్థానాలతో పాటు రెండు పార్లమెంట్ స్థానాలు గెలుచుకొని వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఎమ్మెల్యే స్థానాల కన్నా అత్యధిక స్థానాలు గెలుచుకొని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారన్నారు. సంక్షేమ పథకాలే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి కావాలనే చంద్రబాబు కలలు.. కలలుగానే మిగిలిపోతాయన్నారు. వచ్చే నెల 4న విజయోత్సవ వేడుకలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, కార్యదర్శులు బత్తుల లక్ష్మీకాంతయ్య, గోనెగండ్ల మురళీ నాయుడు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ సక్రమంగా చేయండి



రికార్డులను పరిశీలిస్తున్న ప్రోగ్రాం రాష్ట్ర అధికారి రామనాథరావు

రుద్రవరం: యువత బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సక్రమంగా పూర్తి చేయాలని ప్రోగ్రాం రాష్ట్ర అధికారి రామనాథరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్నలక్ష్మి సూచించారు. మండలంలోని నర్సాపురం పీహెచ్‌సీ పరిధిలో కొనసాగుతున్న యువత బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వారు గురువారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 130 మందికి వ్యాక్సిన్ వేసినట్లు వారు తెలిపారు. అనంతరం పీహెచ్‌సీలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు బాబు, ఎంపీహెచ్ఈఓ నాగప్రసాదు తదితరులు ఉన్నారు.

మద్యం 'రింగ్ మాస్టర్' రింగుల బాషా అరెస్ట్



రింగుల బాషా (ఫైల్)

కర్నూలు: మద్యం రవాణా రింగ్ మాస్టర్ చింపర్తి రింగుల బాషాను కర్నూలు సెబ్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. కర్నూలు శివారులోని అంతర్‌రాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ అధికారుల తనిఖీల్లో గత నెల 6న రూ.14.51 లక్షలు విలువ చేసే 240 బాక్సుల మద్యం పట్టుబడింది. ఈ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న చింపర్తి రింగుల బాషా కోసం కర్నూలు సెబ్ అధికారులు ముమ్మరంగా గాలించారు. అయితే అతనిపై కడప జిల్లాలో కూడా కేసులు ఉండటంతో ఆ జిల్లా పోలీసులు అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న రింగుల బాషాపై కర్నూలు జిల్లాలో అక్రమ మద్యం రవాణా కేసు ఉందని, అతనిని విచారించేందుకు అనుమతివ్వాలని కోరుతూ సెబ్ అధికారులు జేఎఫ్‌సీఎం కోర్టులో ప్రిజనర్ ట్రాన్స్‌ఫర్ (పీటీ) వారెంట్ దాఖలు చేశారు. ఆ మేరకు న్యాయస్థానం అనుమతితో రింగుల బాషాను అరెస్టు చేశారు. ఇదే కేసులో వాహన డ్రైవర్ పఠాన్ సాదిక్, క్లీనర్ షేక్ షఫీలపైనా కేసు నమోదు చేసి పట్టుబడిన రోజే కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామంలోని శ్రీనివాస వైన్స్ పేరుతో బిల్లులు వేయించుకుని వనపర్తి ఐఎంఎల్ డిపోలో మద్యం లోడ్ చేసుకుని మైదుకూరు, ప్రొద్దుటూరుకు తరలిస్తున్న రింగుల బాషా సెబ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. రింగుల బాషాపై గతంలో ఎర్ర చందనం, మద్యం రవాణాకు సంబంధించి దాదాపు 104 కేసులు ఉన్నాయి. వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల పోలీసు అధికారులకు ఈయన మోస్ట్ వాంటెడ్ కావడంతో సెబ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కోర్టు అనుమతితో అరెస్టు చేశారు.

స్ట్రాంగ్ రూములకు నిరంతర విద్యుత్

కర్నూలు(అగ్రికల్చర్): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములకు అమర్చిన సీసీ కెమెరాలు 24 గంటలు పనిచేసే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. గురువారం ఆయన సంబంధిత విద్యుత్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయలసీమ యూనివర్సిటీలో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేందుకు 10 ఇన్వెటర్లు, 125 కేవీ సామర్థ్యం కలిగిన జనరేటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నంద్యాల జిల్లాకు సంబంధించి ఆర్‌జీఎం, శాంతిరామ్ కాలేజీల్లోని స్ట్రాంగ్ రూములకు అవసరమైనన్ని ఇన్వెటర్లు, 2 జనరేటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా మూడు ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. ఒక్కో బృందంలో ఒక జేఈ, లైన్ మ్యాన్ ఉంటారని పేర్కొన్నారు.

రామతీర్థంలో ప్రబలిన అతిసారం





గ్రామంలోని ప్రత్యేక వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న అతిసార వ్యాధి బారిన పడిన మహిళలు

- మహిళ మృతి.. పలువురు ఆస్పత్రిపాలు



మృతి చెందిన విజయరత్నమ్మ (ఫైల్)

బనగానపల్లె రూరల్: మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన ఓ మహిళ అతిసార వ్యాధితో మృతిచెందగా పలువరు ఆస్పత్రుల్లో చికిత్స పొందున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఈ నెల 14న ఎల్ విజయరత్నమ్మ(30), సయ్యద్ మస్తాన్, మక్బుల్‌బాషా, పుల్లమ్మ, మేకల మద్దమ్మ, అల్వకొండ సుధీర్, అల్వకొండ మరియమ్మ, ఎల్ విజయరత్నమ్మ, సుమంత్, అల్వకొండ సువర్ణతో పాటు సుమారు 19 మందికి వాంతులు, విరేచనలు అయ్యాయి. వీరిలో కొందరిని నంద్యాల, మరికొందరిని బనగానపల్లె ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలకు వారి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చేరిన విజయరత్నమ్మ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందింది.

గ్రామానికి క్యూకట్టిన అధికారులు

విషయం తెలుసుకున్న పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోనిక సిబ్బందితో గ్రామానికి చేరుకుని ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరీక్షలు అందిస్తున్నారు. ఎంపీడీఓ నాగరాజుతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించి తాగునీటి ట్యాంకు, పరిసరాలను శుభ్రం చేయించారు. వైద్యశిబిరాన్ని ఎఫ్‌డీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ రెడ్డి, డీపీఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీత సందర్శించి అతిసారం బాధితులతో మాట్లాడారు. కలుషితమైన నీటి వల్లనే అతిసారం బారిన పడివుంటారని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలుకూరు వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది తదిరులు ఉన్నారు.



గ్రామంలోని తాగునీటి ట్యాంకును శుభ్రం చేయిస్తున్న అధికారులు

గన్‌తో కాల్చుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య



కానిస్టేబుల్ శంకర్‌రెడ్డి (ఫైల్)

శ్రీశైలం: స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శంకర్‌రెడ్డి(34) ఆర్థిక ఇబ్బందులతో గన్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డీఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాలివీ.. నందికొట్కూరు మండలం దామగట్లకు చెందిన శంకర్‌రెడ్డి అవివాహితుడు. గతంలో కర్నూలు జిల్లాలోని పలు స్టేషన్‌లలో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. అక్కడి నుంచి బదిలీపై సున్నిపెంట టూటౌన్‌లో రెండేళ్లు.. ఆ తర్వాత గత ఏడాది జూలై నుంచి శ్రీశైలంలోని వన్‌టౌన్ స్టేషన్‌కు బదిలీ అయ్యాడు. స్టేషన్‌లోని రెస్ట్ రూమ్స్‌లోనే ఉంటున్నాడు. అయితే గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో వెపన్స్ రూములోకి వెళ్లి గన్ తెచ్చుకున్న శంకర్‌రెడ్డి తన కుడి కణత వద్ద కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ సమయంలో స్టేషన్‌లో అతను మాత్రమే ఉన్నారు. ఉదయం విధుల్లోకి వచ్చిన హోంగార్డులు విగతజీవిగా పడి ఉన్న శంకర్‌రెడ్డిని గమనించి సీఐ ప్రసాదరావుకు సమాచారం అందించారు. ప్రాథమికంగా ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడతామని డీఎస్పీ తెలిపారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED TEACHERS

Applications are invited from the qualified teachers for the academic year 2024-2025

SUBJECTS	CLASS	NO.OF VACANCIES	MINIMUM QUALIFICATION	SALARY
PRE PRIMARY	ENGLISH	6	ANY DEGREE WITH TTC	15,000 to 20,000
	MATHS	6		
	EVS	6		
PRIMARY	TELUGU	2	ANY DEGREE WITH TTC OR B.Ed	15,000 to 30,000
	ENGLISH	5		
	HINDI	1		
	MATHS	7		
	SCIENCE	3		
	SOCIAL	3		
HIGH SCHOOL	HINDI	1	ANY DEGREE WITH TTC OR B.Ed	30,000 to 40,000
	ENGLISH	5		
	MATHS	4		
	PHYSICS	2		
	CHEMISTRY	2		
	SOCIAL	1		
IIT	PHYSICS	4	B.Ed	30,000 to 50,000
	MATHS	4		
	CHEMISTRY	4		
	BIOLOGY (NEET)	4		
PRINCIPAL		2	B.Ed	30,000 to 50,000
VICE-PRINCIPAL		6	B.Ed	20,000 to 30,000
P.E.T		4	B.P.Ed	15,000 to 25,000
DRAWING		3		15,000 to 25,000
MUSIC		2		15,000 to 25,000
TUTORS / WARDENS		LADIES 2, GENTS 2		15,000 to 25,000
COMPUTER, LIBRARIAN		3		15,000 to 25,000

Fluency in English is must. Interested Candidates may Walk-in-Interview with original certificates on 18-05-2024 (Saturday), 19-05-2024 (Sunday) from 10AM to 6 PM at Acharya NEET Academy, 2nd Floor, Above Pulla Reddy Sweet House, Nalanda Complex, Raj Vihar Circle, Kurnool

FOR MORE DETAILS CONTACT:9666806789, 7013930980

E-Mail Id: yerravallisaraswathischool@gmail.com Transport facility is available from Kurnool

SAMSKAAR SCHOOL,GADWAL 80KM FROM KURNOOL | SRI RAGHAVENDRA HIGH SCHOOL, SHANTHINAGAR, 26KM FROM KURNOOL

SHREE SARASWATHI INTERNATIONAL SCHOOL (CBSE), YERRAVALLI, 38KM FROM KURNOOL

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్/డిస్టెన్స్/మధ్యలో చదువు ఆపేసిన/ఫెయిల్ అయిన వారికి/ ఒకే సంవత్సరంలో పాస్ అయ్యే అవకాశం. 10th, 12th, Diploma, B.Tech, M.Tech, Degree, BCA, BBA, MBA, MCA, LLB, BEd, DEd, MLT, ANM, DMLT, ANESTHESIA, OT, MPHW. 86861 72989 [L-800610]

ADMISSIONS

■ R.R. క్రిస్టియన్ కాలేజి ఆఫ్ నర్సింగ్, కర్నూలులో B.Sc(N), P.B.B.S.C(N)/ GNM (స్టాఫ్ నర్స్) & MSRR కాలేజి ఆఫ్ ఫిజియోథెరపి, కర్నూలులో (ఫిజియోథెరపి డాక్టర్) కోర్స్ మేనేజిమెంట్ కోటా సీట్ల కొరకు సం.ప్ర: 94402 89937. [L-795705]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్: 73821 14647. [V-6481]

WANTED

■ Breakthrough English స్కూలు టీచర్స్ వర్కర్స్, కర్నూలు నందు ప్రైమరీ, హై స్కూల్‌లో ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ బోధించుటకు లేడీ టీచర్లు, పి.ఇ.టి & పనిచేయుటకు వాచ్‌మెన్, డ్రైవర్లు కావలెను. సం.ప్ర: 8500779895, 8374337750. [L-800599]

■ కారు డ్రైవర్ కావలెను: కర్నూలు నగరంలో స్కార్పియో వాహనం నడుపుటకు అనుభవం గల కారు డ్రైవర్ కావలెను. సంప్రదించండి: ఫోన్: 73309 24873, 98854 85281. [L-800611]

■ రిసెప్షనిస్ట్/లేడీ హెల్పర్ కావలెను. అర్హత: 10th/ANM, 10AM to 8PM, శ్రీసాయి బాలాజి డెంటల్ క్లినిక్, రోడ్. నెం:4, వెంకటరమణ కాలనీ, కర్నూలు. సెల్: 98852 53819. [L-795708]

■ అక్షయ కన్సల్టెన్సీ నందు పని చేయుటకు లేడి టెలికాలర్స్ కావలెను. స్కంధాన్షి కాంప్లెక్స్, బళ్ళారి చౌరస్తా దగ్గర, కర్నూలు. సెల్: 82971 56606 [L-795701]

■ శ్రీ వాసవి స్కూల్ నంద్యాలలో పనిచేయుటకు జెంట్స్ హాస్టల్ వార్డెన్స్, హైస్కూల్‌కు మ్యాథ్స్, ఫిజిక్స్, బయోలజి, ఇంగ్లీష్, కంప్యూటర్, PET & ప్రైమరీ టీచర్స్ కావలెను. సెల్: 9642667906, 9441518586. [L-800618]

■ ప్రముఖ ఎడ్యుకేషనల్ సంస్థ నందు పనిచేయుటకు లేడి టెలికాలర్స్ PRO's కావలెను. జీతం+ఇన్సెంటివ్స్. సం.ప్ర: మెడికల్ కాలేజి ఎదురుగా, బుధవారపేట, కర్నూలు. 91771 77289, 89193 00841 [L-800619]

■ కర్నూలు టౌన్‌లో గల ప్రముఖ పవర్ ప్లాంట్, విజయడైరీ మరియు రెస్టారెంట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 10వేలు నుండి 14వేలు, అర్హత: ఇంటర్, డిగ్రీ, సెల్: 9581776924, 9581776925. [L-795707]

■ Trained and Experienced Teachers to Teach Maths, Science & English, Social Subject to Lower Section, Computer Operater. Contact : 99491 51098. [L-795703]

■ Wanted Teachers to Teach (1) KINDER GARTEN (2) Up to 7th Class Maths, English, Science (3) 8th to 10th Social (4) computer Faculty. Fluent English Speaking Skill is Must. Intersted Candidates can Attend Interview on 18-05-2024 from 9.00 am to 1.00 PM. Venue: Ravindra Talent High School, Revenue Colony, Kurnool. Contact: 86399 12348, 93816 79718. [L-795702]

■ సూపర్‌వైజర్స్/మేనేజర్స్ కావలెను. నంద్యాల మునిసిపాలిటీ (Clap programme) నందు చెత్త సేకరణ ఆటోలను పర్యవేక్షణకు అనుభవం గల వారు కావలెను ✆ 8977937517, 9000274257 [B-755710]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. నెల్లూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బద్వేల్, ఒంగోలుకు. 12 గం॥ డ్యూటీ. 45-50 సం. లోపు మగవారికి. 72880 04466, 72880 04477. [NA-11698]

■ హైదరాబాద్‌లోని స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్ & గర్ల్స్, హెల్పర్స్, సె॥గార్డ్స్, సూ॥వైజర్స్ కావలెను. రూమ్+భోజనం ఫ్రీ. జీ: 18000/- to 30,000/- చదువులేకున్నా. Ph: 9989930582 [H-801618]

■ కన్సల్టెన్సీకాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పు,ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000,ఫ్రీరూం+ భోజనం. HYD. 9014885406 [HA-131]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సం.ప్ర. 9948666206,9573633520. [M-1233982]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద శాతం 'ఉపాధి'

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 శాతం ఉపాధి పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయం నుంచి ఏపీడీ, ఏపీఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారురు. కొన్ని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి పనులు కల్పించేందుకు గ్రామ సర్పంచ్‌లు సహకరించడం లేదని కొందరు ఏపీఓలు డ్వామా పీడీ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ సహకరించని సర్పంచ్‌ల విషయాన్ని ఎంపీడీఓల దృష్టికి తీసుకెళ్లాలని, అప్పటికీ ఫలితం లేకపోతే జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. నిన్న, మొన్నటి వరకు ఎన్నికల ప్రచారాలు ఉండటంతో ఉపాధి పనులకు అంతగా డిమాండ్ లేదన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసినందున డిమాండ్‌కు అనుగుణంగా అన్ని గ్రామాల్లో పనులు కల్పించాలన్నారు. వర్షాలు పడుతున్నందున పండ్లతోటల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం కండి



మాట్లాడుతున్న డీఏఓ పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ యంత్రాంగం మొత్తం ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) పీఎల్ వరలక్ష్మి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఏడీఏలు, సాంకేతిక ఏఓలతో నిర్వహించిన సమావేశంలో డీఏఓ మాట్లాడారు. ఈ సారి పత్తి సాగు పెరిగే అవకాశం ఉన్నందున మండలాల వారీగా బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు ఎన్ని అవసరమో అంచనా వేసి తెలపాలన్నారు. జిల్లాకు ఇప్పటికే సబ్సిడీపై పంపిణీకి విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాత ఆర్‌బీకేల్లో విత్తనాలు పొజిషన్ చేయడం, రిజిస్ట్రేషన్‌లు మొదలు పెట్టడతామన్నారు. బీటీ పత్తి విత్తనాల్లో నకిలీలకు తావు లేకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. సబ్సిడీ వేరుశనగలో నాణ్యత 100 శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఏడీఏలు సాలురెడ్డి, మహమ్మద్ ఖాద్రీ, బాలవర్ధిరాజు, సునీత, అగ్రానమీ ఏడీఏ అరుణకుమారీ, సాంకేతిక ఏవోలు పాల్గొన్నారు.

శ్రీశైలంఘాట్‌లో లోయలోకి దూసుకెళ్లిన బొలెరో

- పలువురికి గాయాలు
- సున్నిపెంట ఆసుపత్రికి తరలింపు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలానికి 15 కి.మీ. దూరంలోని ఆంజనేయ స్వామి గుడి సమీపంలో అదుపుతప్పి బొలెరో వాహనం లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కర్నూలు జిల్లా కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలోని 10 మందికి తీవ్ర గాయాలు కాగా మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని నంద్యాల జిల్లా సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు 108 వాహనంలో తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం ప్రేమ్‌కుమార్, నగేష్, వెంకటరాముడు, రమేష్, కేశవులు, మనోహర్, ఎం.సురేష్, ఎల్.కుమార్‌లను జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరంతా రెండు బొలెరో వాహనాల్లో భ్రమరాంభ మల్లికార్జునస్వామి వార్ల దర్శనార్థం శ్రీశైలం బయలు దేరారు. ఒక వాహనంలో పురుషులు, మరో వాహనంలో మహిళలు ఉన్నారు. పురుషులు ఉన్న వాహనం అదుపుతప్పి సైడ్‌వాల్‌ను ఢీకొట్టి లోయలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రకాశం జిల్లా దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



లోయలోకి దూసుకెళ్లి బాల్తా పడిన బొలెరో వాహనం



క్షతగాత్రులను సున్నిపెంట ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది